

వినికిడి సమస్యలతో బాధపడుతున్న చిన్నారులతో మంత్రి కొండా సురేఖ

వినికిడి సమస్యల పట్ల అప్రమత్తంగా ఉండాలి

● మంత్రి కొండా సురేఖ

బంజారాహిల్స్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఆధునిక యుగంలో పెరుగుతున్న శబ్ద కాలుష్యం వల్ల వినికిడి సమస్యలు పెరుగుతున్నాయని, ముఖ్యంగా చిన్నారుల్లో ఈ సమస్య ఎక్కువగా ఉందని రాష్ట్ర మంత్రి కొండా సురేఖ అన్నారు. జూబ్లీహిల్స్‌లోని మా ఈఎన్‌టీ ఆస్పత్రిలో సోమవారం జరిగిన ప్రపంచ వినికిడి దినోత్సవాల్లో మంత్రి సురేఖ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తల్లిదండ్రులు చిన్నారుల పట్ల అప్రమత్తంగా ఉంటే భవిష్యత్తులో వినికిడి సమస్యలను అధిగమించవచ్చన్నారు. పేదలకు సహాయం చేసే సంస్థలకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఆమె వెల్లడించారు. మా ఈఎన్‌టీ ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ కేఆర్ మేఘనాథ్ మాట్లాడుతూ.. వినికిడి సమస్యలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు తమ ఆస్పత్రి ఆధ్వర్యంలో ప్రతి ఏటా ప్రపంచ వినికిడి దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుజితారెడ్డి, డాక్టర్ ముర్తుజా, డాక్టర్ లక్షిత్, ఆడియాలజిస్ట్ వికాస్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు నూతన భవనం నిర్మించండి

● కలెక్టర్‌కు లేఖ రాసిన ఎమ్మెల్యే తలసాని

అమీర్‌పేట, మార్చి 3(ఆంధ్రజ్యోతి): సనత్‌నగర్‌లోని ప్రభుత్వ బాలికల ప్రాథమిక పాఠశాలలో నూతన భవనాన్ని నిర్మించాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ మేడ్చల్ జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్‌కు సనత్‌నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మి బాల్‌రెడ్డి ద్వారా లేఖను పంపించారు. సనత్‌నగర్‌లోని రౌండ్ టేబుల్ స్కూల్‌లో విద్యార్థుల సంఖ్యకు సరిపడా గదులు లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారని కార్పొరేటర్ లక్ష్మి ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఎమ్మెల్యే తలసాని ఇటీవల స్థానిక అధికారులతో కలిసి పాఠశాలను సందర్శించి విద్యార్థులు, స్కూల్ సిబ్బందితో మాట్లాడారు. వారి విజ్ఞప్తి మేరకు స్కూల్ సమీపంలో నిరుపయోగంగా ఉన్న పబ్లిక్ హెల్త్ సెంటర్‌లో నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కలెక్టర్‌ను కోరారు.


హనుమంత వాహనంపై విహరిస్తున్న వెంకటేశ్వరస్వామి

కన్నులపండువగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు

బంజారాహిల్స్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ తిరుమల తిరుపతి దేవస్థానంలో వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు కన్నులపండువగా జరుగుతున్నాయి. సోమవారం ఉదయం స్వామివారికి ప్రత్యేక సుప్రభాత సేవ నిర్వహించారు. అనంతరం హనుమంత వాహనంపై స్వామివారిని ఊరేగించారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పంజాగుట్ట, మార్చి 3(ఆంధ్రజ్యోతి): మరమ్మతుల కారణంగా బంజారాహిల్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ జి.గోపి తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు 11కెవి విశ్వభారతి ఫీడర్ పరిధిలోని విశ్వభారతి, మధురానగర్, శ్రీనివాస నగర్ వెస్ట్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ పేర్కొన్నారు.

గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ పరిధిలో..

మరమ్మతుల కారణంగా గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ చరణ్ సింగ్ తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు 11కెవి కామత్ లింగాపూర్ హౌస్ ఫీడర్ పరిధిలోని ప్రకాష్‌నగర్ ఎక్స్‌టెన్షన్, వాటర్ ట్యాంక్, కామత్ లింగాపూర్ హౌస్ ప్రాంతాల్లో.. మధ్యాహ్నం 12 గంటల నుంచి ఒంటి గంట వరకు 11కెవి ఇంటర్ గ్రాఫ్ ఫీడర్ పరిధిలోని ఇంటర్ గ్రాఫ్ ప్రాంతంలో.. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 వరకు 11కెవి బీఎస్ పురి, ఎర్రగడ్డ ఫీడర్ల పరిధిలోని బీఎస్ పురి కాలనీ, గౌతమ్ పురి కాలనీ, మిడ్ ల్యాండ్ బేకరీ, నటరాజ్ నగర్, సుల్తాన్ నగర్, శంకర్‌లాల్ నగర్, నేతాజీ నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ పేర్కొన్నారు.


స్థానికులను అడిగి సమస్యలు తెలుసుకుంటున్న సీపీఎం నేతలు

సమస్యలపై సీపీఎం నాయకుల ఇంటింటి సర్వే

బోరబండ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): బోరబండ డివిజన్ పరిధిలోని సంతోష్ నగర్‌లో సీపీఎం జూబ్లీహిల్స్ జోన్ కమిటీ ఆధ్వర్యంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సోమవారం ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సమస్యలను స్థానికులు వారికి వివరించారు. ప్రధానంగా సంతోష్ నగర్ చెన్నకేశవస్వామి ఆలయం పరిసర ప్రాంతాల్లో రాత్రి సమయంలో మందుబాబుల ఆగడాలు ఎక్కువయ్యాయని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని బస్తీ అధ్యక్షుడు శ్రీనివాస్ కోరారు. తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతోందని, కొన్ని ప్రాంతాల్లో షార్ట్ సర్క్యూట్‌తో ఇబ్బందికరంగా ఉంటుందని ఫిర్యాదు చేశారు. కొత్తగా అమలుచేస్తున్న పథకాలకు దరఖాస్తు చేసుకున్న చాలామందికి కరెంటు బిల్లులు, గ్యాస్ బిల్లులు మాఫీ కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఎం జూబ్లీహిల్స్ జోన్ నాయకులు టి.సాయి శేషగిరిరావు, జె.స్వామి, మద్దిలేటి, ఏఆర్ నరసింహ, బాలయ్య, జ్యోతి, సత్యనారాయణ, శేషు, భవాని, మల్లీశ్వరి, షేక్ బాబు తదితరులు పాల్గొన్నారు.

బోరబండ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన సురేందర్

బోరబండ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): బోరబండ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా మల్కాపురం సురేందర్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. చార్మినార్ ట్రాఫిక్ విభాగం ఎస్‌హెచ్‌ఓగా ఉన్న ఆయన ఇటీవల బోరబండ పీఎస్‌కు బదిలీ అయ్యారు. ఇక్కడి ఎస్‌హెచ్‌ఓ సుంకరి వీరశేఖర్ చార్మినార్ ట్రాఫిక్ విభాగం ఇన్‌స్పెక్టర్‌గా వెళ్లారు. బోరబండ పీఎస్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని నూతన ఇన్‌స్పెక్టర్ సురేందర్ వెల్లడించారు.


సురేందర్

వారి వెనుక వెళ్లాలంటే కష్టమే!

● ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న లారీ, ట్యాంకర్ డ్రైవర్లు
● వెనుక వెళ్లేవారిని ముంచెత్తుతున్న ఇసుక, నీళ్లు, ఇతర వ్యర్థ పదార్థాలు
● తీవ్ర అసౌకర్యానికి గురవుతున్న వాహనదారులు
● అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి

మోతీనగర్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): రోడ్లపై కొందరు వాహనదారులు బాధ్యతారాహిత్యంతో వ్యవహరిస్తుండటంతో ఇతర వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మాదాపూర్, అయ్యప్ప సొసైటీ ప్రాంతాల్లో లారీ డ్రైవర్లు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. వీరి నిర్లక్ష్యం కారణంగా పలుమార్లు ప్రమాదాలు జరుగుతున్నాయి. అయినప్పటికీ వారి తీరు పోలీసులకు సైతం తలనొప్పిగా మారింది. ఫిలింనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా నడుస్తూ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టడంతో ఐదో తరగతి చదువుతున్న చిన్నారి మరణించింది. ఈ ఘటన తర్వాత పోలీసులు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నప్పటికీ కొందరు వాహనదారుల్లో మాత్రం మార్పు రావడం లేదు.

ఇసుక లారీలతో అవస్థలు

మాదాపూర్ చంద్రనాయక్ తండాలో భవన నిర్మాణాల నిమిత్తం చిన్న, భారీ వాహనాల ద్వారా నిర్మాణ సామగ్రిని సరఫరా చేస్తుంటారు. అయితే నిబంధనలను పాటించని వాహన యజమానులు మైనర్లతో డ్రైవింగ్ చేయించడం వల్ల గతేడాది డిసెంబర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నా రాత్రి, పగలు అనే తేడా లేకుండా నిర్మాణ రంగ ముడి పదార్థాలైన ఇసుక, క్వారీ డస్ట్, కంకర, సిమెంట్, మట్టి వంటి వాటిని లారీలతో రవాణా చేస్తున్నారు. ఈ వాహనాలు పలు నిబంధనలు పాటించాల్సి ఉన్నప్పటికీ అవేమీ పట్టించుకోవడం లేదు. దీంతో వేగంగా వెళ్లే సమయంలో లారీలో ఉన్న ఇసుక వాహనం వెనుక ప్రయాణించే వాహనదారుల కళ్లలో పడుతోంది. కళ్లలో ఇసుక పడడంతో వెంటనే బ్రేక్ వేయడం వల్ల వెనుక వస్తున్న వాహనం వారిని ఢీకొనడం వంటి ఘటనలు తరచూ జరుగుతున్నాయి. ఇసుక కళ్లల్లో పడటం వల్ల తీవ్రఅస్వస్థకు గురై ఆస్పత్రి పాలైన సందర్భాలు చాలానే ఉన్నాయి.


ఎలాంటి రక్షణ చర్యలు పాటించకుండా డస్ట్‌ను తరలిస్తున్న లారీ

కోళ్లను తరలించే వాహనాలూ అంతే

కోళ్లను తరలించే వాహనానికి నాలుగు వైపులా డోర్లు వేసి రవాణా చేయాల్సి ఉంటుంది. అవేవీ పట్టించుకోకుండా నిబంధనలకు విరుద్ధంగా కోళ్లను రవాణా చేస్తున్నారు. ఈ క్రమంలోనే గత నెలలో మాదాపూర్ 100 ఫీట్ రోడ్డులో ఓ వ్యక్తి కోళ్ల వాహనం వెనుక వస్తుండగా కళ్లలో వ్యర్థాలు పడటంతో కింద పడిపోయాడు. తీవ్ర గాయాలు కావడంతో ఆస్పత్రి పాలయ్యాడు. కోళ్ల సరఫరాదారులు బాధితుడికి నష్టపరిహారం కింద చికిత్స ఖర్చులు చెల్లించి కేసు లేకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.



నిబంధనలు పాటించకుండా కోళ్లను తరలిస్తున్న వాహనం

నీళ్ల ట్యాంకర్ వస్తే తడిసిపోవాల్సిందే

అయ్యప్ప సొసైటీలో భారీ నిర్మాణాలు చేపడుతుండటంతో వారికోసం నిత్యం నీటి ట్యాంకర్‌లు వస్తుంటాయి. ఈ ట్యాంకర్లపై కనీసం మూతలు సైతం లేని పరిస్థితి ఉంటోంది. కొన్ని ట్యాంకర్ల నుంచి నీరు లీక్ అవుతుంటుంది. కొన్ని సందర్భాల్లో ట్యాంకర్‌లో ఉన్న నీరు ద్విచక్రవాహనదారులపై పడటంతో వారు తడిసిపోతున్నారు. దీంతో రకరకాల పనుల మీద వెళ్లే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నీళ్లు పడటంతో వారి వద్ద ఉన్న ఎలక్ట్రానిక్ వస్తువులు పాడైన సంఘటనలు సైతం ఉన్నాయి. ట్యాంకర్ డ్రైవర్లు మితిమీరిన వేగంతో వెళ్తుండటంతో వారి వెనుక వెళ్లాలంటేనే భయపడిపోయే పరిస్థితి ఉందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిర్లక్ష్యంగా వాహనాలు నడుపుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం

ఇసుక లారీలు, కోళ్లను తరలించే వాహనాలు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల మధ్య మాత్రమే రాకపోకలు సాగించాలి. రోడ్లపైకి వచ్చినప్పుడు వారు పూర్తి స్థాయిలో నిబంధనలు పాటించాలి. వాటర్ ట్యాంకర్లకు 24 గంటలూ అనుమతి ఉన్నప్పటికీ భద్రత ప్రమాణాలు పాటించకుంటే కఠినంగా వ్యవహరిస్తున్నాం. పెద్ద ఎత్తున జరిమానాలు విధిస్తున్నాం. అయినా తీరు మారకుంటే అటువంటి వాహనాలను గుర్తించి సీజ్ చేస్తాం. ఇందుకోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నాం.

- సత్యనారాయణ, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్, మాదాపూర్

తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు

● కార్పొరేటర్ మహేశ్వరి

బేగంపేట, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని కార్పొరేటర్ మహేశ్వరి పేర్కొన్నారు. సోమవారం వాటర్ వర్క్స్ మేనేజర్ రామేశ్వరరావుతో కలిసి డివిజన్‌లోని బ్రాహ్మణవాడి, వడ్డెబస్తీ, మాతాజీనగర్‌లో ఆమె పర్యటించారు. తాగునీరు లోప్రెషర్‌తో వస్తుండటంతో చివరి ఇళ్లకు సక్రమంగా అందడం లేదని, కొన్నిప్రాంతాల్లో కలుషిత నీరు వస్తుందని స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకొచ్చారు. చాలా ప్రాంతాల్లో సీవరేజీ పొంగి రోడ్లపై ప్రవహిస్తుందని ఫిర్యాదు చేశారు. సమస్యలు తెలుసుకున్న ఆమె అధికారులతో మాట్లాడారు. ప్రధానంగా బ్రాహ్మణవాడి, మాతాజీనగర్ ప్రాంతాల్లో నీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు శ్రీహరి, సునీత తదితరులు పాల్గొన్నారు.


మాతాజీనగర్‌లో మ్యాన్‌హోల్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ మహేశ్వరి


జవహర్‌నగర్ మసీద్ గడ్డలో పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ దేదీప్య

పైప్‌లైన్ పనులు ప్రారంభం

వెంగళరావునగర్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): తాగునీటి కోసం జవహర్ నగర్ మసీద్ గడ్డ ప్రజల ఇబ్బందులపై గత నెల 17న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి స్పందన వచ్చింది. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఆదేశాల మేరకు స్థానిక కార్పొరేటర్ దేదీప్య సోమవారం తాగునీటి పైప్‌లైన్ నిర్మాణ పనులను ప్రారంభించారు. పనులు ప్రారంభిస్తున్నామని, త్వరలోనే సమస్య పరిష్కారమవుతుందని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శ్యామ్ ముదిరాజ్, విజయ్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలి

● బోయ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు గోపి

పంజాగుట్ట, మార్చి 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని, ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చాలని బోయ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు మీనగ గోపి బోయ డిమాండ్ చేశారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని గత 30 సంవత్సరాలుగా తాము పోరాడుతున్నామని, పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో తమను ఎస్టీల్లో చేరుస్తామని రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఇచ్చిన మాటను సీఎం నిలబెట్టుకోవాలని, రూట్ మ్యాప్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఈసారి ఎన్నికల్లో తమ తడాఖా చూపిస్తామని హెచ్చరించారు. వాల్మీకి బోయలకు చట్టసభల్లో సముచిత స్థానం కల్పించాలని, తమ సామాజిక వర్గానికి ఎమ్మెల్సీ పదవి కేటాయించాలని సీఎం రేవంత్ రెడ్డిని ఆయన కోరారు. ఈ సమావేశంలో సమితి ఉపాధ్యక్షుడు పుట్ట అంజయ్య, న్యూ ఇండియా పార్టీ ఉపాధ్యక్షుడు మాదర బోయిన నర్సయ్య, గగనం వెంకటస్వామి, అలివేలు, సి.పరమేశ్వరి, గుజ్జుల యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మీనగ గోపి

ముదిరాజ్‌లకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

● మన ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు చొప్పరి శంకర్

పంజాగుట్ట, మార్చి 3(ఆంధ్రజ్యోతి): ముదిరాజ్ సామాజిక వర్గాన్ని విస్మరిస్తే బీఆర్ఎస్‌కు పట్టిన గతే కాంగ్రెస్ ప్రభుత్వానికి పడుతుందని మన ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు చొప్పరి శంకర్ ముదిరాజ్ హెచ్చరించారు. జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ముదిరాజ్ సంఘాల నాయకులతో కలిసి ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలన్నారు. కేసీఆర్ హయాంలోని సమగ్ర కుటుంబ సర్వే లెక్కలకు, ప్రస్తుత ప్రభుత్వం చేపట్టిన కుల సర్వే లెక్కలకు చాలా తేడా ఉందని, తమ జనాభాను తక్కువగా చూపించారని ఆరోపించారు. రేవంత్ రెడ్డి ప్రతి బహిరంగ సభలో ముదిరాజ్‌లను బీసీ-డి గ్రూపు నుంచి బీసీ-ఏ జాబితాలో చేరుస్తామని చెప్పారని, అయితే ఎన్నికల తర్వాత సీఎం నోటి వెంట ముదిరాజ్‌ల మాటే రావడం లేదని విమర్శించారు. తమ సామాజిక వర్గానికి ఉన్న ఒక్క ఎమ్మెల్యేతో పాటు మరొకరికి మంత్రివర్గంలో స్థానం కల్పించాలని, నాలుగు ఎమ్మెల్సీలు,పది కార్పొరేషన్ చైర్మన్ పదవులు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ముదిరాజ్ మత్స్యకారులపై దాడులు జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. సమావేశంలో ముదిరాజ్ సంఘాల నాయకులు అశ్విని ముదిరాజ్, సాయికిరణ్, సంతోష్ పాల్గొన్నారు.


అభివాదం చేస్తున్న ముదిరాజ్ సంఘాల నాయకులు

ఎన్టీఆర్ మార్గ్‌లో కారు బీభత్సం

● కారు నడిపిన బాలుడి నిర్లక్ష్యంతోనే ప్రమాదం

ఖైరతాబాద్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ మార్గ్‌లో ఓ బాలుడు తన స్నేహితులతో కలిసి కారు నడుపుతూ బీభత్సం సృష్టించాడు. ఖైరతాబాద్ ఫ్లైఓవర్ నుంచి తెలుగుతల్లి చౌరస్తా వైపు వెళ్లే మలుపు వద్ద కారు అదుపు తప్పడంతో ఫుట్‌పాత్‌పైకి దూసుకెళ్లింది. దీంతో ఓ చెట్టును, విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి ట్యాంక్‌బండ్ రెయిలింగ్‌ను బలంగా ఢీకొనడంతో కారు నుజ్జునుజ్జయ్యింది. సైఫాబాద్ ఎస్‌ఐ పరమేశ్వరి తెలిపిన వివరాల ప్రకారం.. మారేడుపల్లికి చెందిన ఓ బాలుడు (17) సోమవారం ఉదయం తమ కారు తీసుకొని మరో ఇద్దరు స్నేహితులతో కలిసి బయటకు వచ్చాడు. ఖైరతాబాద్ ఫ్లైఓవర్ పైనుంచి తెలుగుతల్లి చౌరస్తాకు వెళ్తున్న క్రమంలో నిర్లక్ష్యంగా నడపడంతో ఎన్టీఆర్ గార్డెన్ పార్కింగ్ ముందున్న మూల మలుపు వద్ద కారు అదుపు తప్పి ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంతో చెట్టు, విద్యుత్ స్తంభం విరిగిపోవడంతో పాటు కారు ధ్వంసమైంది. కారు నడిపిన బాలుడు స్వల్ప గాయాలతో బయటపడగా ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతడి స్నేహితులకు ఎయిర్ బెలూన్స్ తెరుచుకోవడంతో ప్రమాదం నుంచి బయటపడి పారిపోయారు. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. సమాచారం అందుకున్న సైఫాబాద్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని కారును పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ప్రమాదానికి కారకుడైన బాలుడిని విచారించారు. కాగా, ఈ ప్రమాదంతో హెచ్‌ఎండీఏకు రూ.5 లక్షల ఆస్తినష్టం జరిగిందని సంబంధిత అధికారులు సైఫాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. లైసెన్స్ లేకుండా కారు నడిపిన బాలుడిపై కేసు నమోదు చేస్తామని ఎస్‌ఐ పరమేశ్వరి తెలిపారు.


ప్రమాదానికి కారణమైన కారు


ఈవోకు ఫిర్యాదు చేసేందుకు వచ్చిన స్థానికులు

ఆలయ అర్చకుడి స్థానమార్పుపై వివాదం

● ఈవోకు ఫిర్యాదు చేసిన స్థానికులు
● తిరిగి అదే ఆలయానికి వెళ్లాలని ఆదేశం

అమీర్‌పేట, మార్చి 3(ఆంధ్రజ్యోతి): సనత్‌నగర్ హనుమాన్ దేవాలయంలో అధికారులకు సమాచారం ఇవ్వకుండా అర్చకుడి స్థానమార్పు అంశం వివాదాస్పదంగా మారింది. దేవాదాయ శాఖ పరిధిలోని సనత్‌నగర్ ఆంజనేయస్వామి ఆలయంలో అర్చకత్వం చేస్తున్న విజయేంద్రపై మూడేళ్ల క్రితం భక్తులు అప్పటి దేవాదాయ శాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో అప్పట్లో దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ విజయేంద్రపై వచ్చిన ఆరోపణలపై విచారణ చేసిన అనంతరం దేవాలయ ఆవరణలోని పోచమ్మ ఆలయానికి అర్చకుడిగా నియమించారు. అప్పటి నుంచి పోచమ్మ ఆలయంలో విధులు నిర్వహిస్తున్న విజయేంద్రను రెండు రోజుల క్రితం స్థానిక కార్పొరేటర్ తిరిగి ఆంజనేయస్వామి ఆలయ అర్చకుడిగా నియమించారంటూ స్థానికులు కృష్ణ గౌడ్, పుట్నాల రాజేశ్వర్ (రాజన్న), రవీందర్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, కన్నయ్య యాదవ్, హన్మంతరావు తదితరులు దేవాలయం ఈవో సత్యనారాయణకు ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన ఈవో విజయేంద్రను తిరిగి పోచమ్మ ఆలయానికి అర్చకుడిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఆకట్టుకున్న కథక్ నృత్య ప్రదర్శన

బంజారాహిల్స్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 7లో ఆద్యం హ్యాండ్ ఓవెన్, ఓరో జ్యువెల్స్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన కథక్ నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని హోరి పేరుతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో న్యూయార్క్‌లో ప్రసిద్ధిగాంచిన కథక్ కళాకారులు బర్ఖా పటేల్, తస్వీనర్ ఆలం వివిధ పాటలకు నృత్యాలు చేస్తూ అలరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రిటైర్డ్ ఐఏఎస్ అజయ్ మిశ్రా, డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క సతీమణి నందిని మల్లు, టర్కీ కౌన్సిల్ జనరల్ ఉరాన్, ఫిక్కీ ఫ్లో చైర్‌పర్సన్ ప్రియా గజ్దర్, అక్షత్, మనీష్, అన్వేష్, విశేష్ తదితరులు పాల్గొన్నారు.


నృత్య ప్రదర్శనలో బర్ఖాపటేల్



నృత్య ప్రదర్శన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వేదకీర్తి తదితరులు

7న వెయ్యిమంది విద్యార్థినులతో నృత్య ప్రదర్శన

పంజాగుట్ట, మార్చి 3(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా క్రీవీ ఇషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవ్ ది గర్ల్ చైల్డ్ పేరుతో అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామని ఫౌండేషన్ ఉపాధ్యక్షురాలు కె.వేదకీర్తి తెలిపారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఈ నెల 7న వెస్ట్ మారేడ్‌పల్లిలోని కస్తూర్బా గాంధీ డిగ్రీ, పీజీ కళాశాలలో నిర్వహించనున్న తెలంగాణ జానపద నృత్య ప్రదర్శన పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాలికల హక్కులు, మహిళా సాధికారతపై అవగాహన కల్పిస్తూ శారీరక, మానసిక ఆరోగ్యం ప్రాధాన్యతను వివరిస్తూ వెయ్యి మంది విద్యారినులతో నృత్య ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమాజ అభివృద్ధి, దేశ భవిష్యత్తు కోసం మహిళా శక్తిని ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఫిజికల్, మెంటల్ ఫిట్‌నెస్‌పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు.

బస్తీ దవాఖానాలో వైద్యుడు కరువు



సాంబమూర్తినగర్ బస్తీ దవాఖానా

బస్తీ దవాఖానా పనిచేయు వేళలు...
సోమవారం నుంచి శుక్రవారం వరకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు
శనివారం సెలవు
ఆదివారం మధ్యాహ్నం వరకు

రెజిమెంటల్‌బజార్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజలకు నాణ్యమైన ఉచిత వైద్యం అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానాలో వైద్యుడు లేక వైద్యం కోసం వచ్చిన వారిని సమీపంలో ఉన్న మరో బస్తీ దవాఖానాకు పంపిస్తున్న దుస్థితి. సనత్‌నగర్ నియోజకవర్గం మోండా డివిజన్ సాంబమూర్తి నగర్‌లో ఉన్న బస్తీదవాఖానాలో నాలుగు నెలలుగా వైద్యుడు లేడు. కేవలం స్టాఫ్ నర్సుతో వెల్లదీస్తున్నారు. ఎక్కువగా మార్కెట్‌లో వ్యాపారాలు చేసుకునే పేదలతో పాటు సమీపంలో ఉన్న బస్తీలకు చెందిన పేదలు ఏ అనారోగ్యం కలిగిన సమీపంలో ఉన్న బస్తీ దవాఖానకు వస్తుంటారు. వైద్యుడు లేక పోవడంతో అవస్థలు పడుతున్నారు. అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో కాకుండా ప్రభుత్వ వైద్యుడిని ఏర్పాటు చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

వైద్య చికిత్సలు...

జలుబు, జ్వరం, తలనొప్పి, బీపీ, షుగర్, సాధరణ రుగ్మతలకు వైద్యం అందుబాటులో ఉంటుంది. రెగ్యులర్‌గా వ్యాక్సిన్స్ అందిస్తారు. బస్తీ దవాఖాన ప్రాంతాలలో ప్రజలకు వ్యాధులపై అవగాహన కల్పిస్తు జాగ్రత్తలు చెబుతారు. అవసరం ఉన్న వారికి ఇతర ప్రభుత్వ ఆస్పత్రులకు రెఫర్ చేస్తారు. 60 రకాల ల్యాబ్ పరీక్షలు ఉచితంగా చేస్తారు. ల్యాబ్ రిపోర్టులను నేరుగా ఫోన్‌కు మెస్సేజ్ పంపిస్తారు. బీపీ, షుగర్, జలుబు, జ్వరం వంటి వాటికి స్టాఫ్ నర్సు టాబ్లెట్లు ఇస్తున్నారు. డాక్టర్ అవసరం ఉన్నపుడు శివాజీనగర్‌లో ఉన్న బస్తీ దవాఖానాకు రోగులు పంపిస్తున్నారు. ఒకవేళ సాంబమూర్తినగర్ ఉన్న స్టాఫ్ నర్సు సెలవుపై వెళ్తే శివాజీ నగర్ బస్తీ దవాఖాన వైద్యుడు కాని స్టాఫ్ నర్సుగాని వచ్చి వైద్య సేవలు అందిస్తున్నారు.

పర్మినెంటు ఉద్యోగాలు కాకపోవడంతో అనాసక్తి..

బస్తీ దవాఖానాలలో ఒక వైద్యుడు, స్టాఫ్ నర్సు, సపోర్టింగ్ స్టాఫ్ మొత్తం ముగ్గురు సిబ్బంది ఉంటారు. ఇందులో వైద్యుడు, స్టాఫ్ నర్సు అవుట్ సోర్సింగ్, సపోర్టింగ్ స్టాఫ్ కాంట్రాక్ట్ పద్ధతిలో నియమిస్తారు. బస్తీ దవాఖానాలలో చేరే సిబ్బంది పర్మినెంట్ ఉద్యోగాలు కాకపోవడంతో వేరే అవకాశాలు రాగానే వెళ్లి పోతున్నారు. మళ్లీ ఖాళీలు పూర్తి చేయాలంటే అన్ని బస్తీ దవాఖానాలలో ఖాళీలను సేకరించి నియామక ప్రక్రియ చేపడతారు. ఇదంతా జరగాలంటే సుమారు అరు నెలల సమయం పడుతుంది. దీంతో ఖాళీ అయిన స్థానంలో భర్తీ చేయడం ఆలస్యంగా అవుతుంది.

రూపాయి ఖర్చు లేదు



నేను మార్కెట్‌లో కూరగాయలు అమ్ముతాను. ఇంటి దగ్గర కంటే మార్కెట్ లోనే ఎక్కువగా ఉంటాను. జ్వరం వచ్చిన ఏమన్నా సుస్తుగా అనిపిస్తే సాంబమూర్తి నగర్‌లో ఉన్న బస్తీ దవాఖానకు పోతా. మంచిగా చూస్తారు. పరీక్షలు చేస్తారు మందులు ఇస్తారు. మాలాంటోళ్లకు రూపాయి ఖర్చు లేకుండా దవాఖానలో చూస్తారు.

\- లలిత, వెజిటేబుల్ వెండర్

ప్రైవేట్ దవాఖానాలో ఫీజుల భయం



నేను మార్కెట్‌లో కూలీగా పనిచేస్తున్న. నేను పొద్దంత పనిచేస్తే ఇల్లు గడవడమే కష్టం. అలాంటిది ప్రైవేట్ దవాఖానాకు పోవాలంటే ఫీజులు చూస్తే భయమేస్తది. మార్కెట్ దగ్గర బస్తీ దవాఖానా పెట్టిన దగ్గర నుంచి అక్కడి వెళ్తున్న. మంచిగా చూస్తాడు, మందులు ఇస్తారు. అవసరమైతే పరీక్షలు కూడా చేస్తారు.

\- లక్ష్మీ కూలీ



బోయిన్‌పల్లి ఢిల్లీ పబ్లిక్ స్కూల్ వద్ద స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్, ఏసీపీ శంకర్‌రాజు, బోర్డు అధికారులు దేవేందర్

ఢిల్లీ పబ్లిక్ స్కూల్ వద్ద స్థల పరిశీలన

బోయిన్‌పల్లి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ డైమండ్ పాయింట్ లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ముందు ట్రాఫిక్‌కు ఇబ్బంది కలుగుతుందని తోపుడు బండ్లను పోలీసులు తొలగించడంతో చిరు వ్యాపారులు తమ జీవనాధారం దెబ్బతింటుందని ఎమ్మెల్యే శ్రీగణేష్‌కు విన్నవించుకున్నారు. వ్యాపారుల అభ్యర్థన మేరకు ఎమ్మెల్యే శ్రీగణేష్ సోమవారం ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు, ట్రాఫిక్ సీఐ మధుబాబు, కంటోన్మెంట్ సూపరింటెండెంట్ దేవేందర్‌తో కలిసి ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఎదుట ఉన్న ప్రాంతాన్ని పరిశీలించి అధికారులతో చర్చించారు. ఈ నేపథ్యంలో ట్రాఫిక్‌కు ఇబ్బంది కలగకుండా వ్యాపారం చేసుకోవాలని, రోడ్డుపైకి రాకుండా పార్కింగ్ ఏర్పాటు చేసుకోవాలని పరిసరాల్లో చెత్త వేయకుండా చూసుకోవాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని వ్యాపారులకు ఎమ్మెల్యే సూచించారు. వ్యాపారుల జీవనాధారానికి సహకరించాలని అధికారులకు సూచించారు. దీనికి అధికారులు సానుకూలంగా స్పందించడంతో వ్యాపారులు ఎమ్మెల్యే శ్రీగణేష్, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

హిందూ శ్మశాన వాటికలో షెడ్డు నిర్మాణం

అడ్డగుట్ట, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మారేడుపల్లిలోని హిందూ శ్మశాన వాటికలో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ సొంత ఖర్చులతో షెడ్డు నిర్మాణం చేపట్టారు. ఈ శ్మశాన వాటికలో తమ ఆత్మీయులు బంధువుల అంతిమ సంస్కారాలు నిర్వహించుకోవడానికి వచ్చిన వారి సౌకర్యార్థం ఎవరు కూడా ఇబ్బందులు పడవద్దని ఎమ్మెల్యే శ్రీగణేష్ సొంత ఖర్చులతో ఖరీదైన షెడ్డు నిర్మించారు. అందుకు హిందూ శ్మశాన వాటిక డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షుడు వెంకటస్వామి, సభ్యులు లక్ష్మణ్, చిట్టిబాబు, రఘురాం, నర్సింగ్, వేణుగోపాల్, సత్యనారాయణ సోమవారం తుకారాంగేట్‌లోని ఎమ్మెల్యే నివాసానికి వెళ్లి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే హామీ ఇచ్చిన మూడు నెలల్లోనే నిర్మాణం పూర్తి కావడంతో ఎమ్మెల్యేను ప్రత్యేకంగా అభినందించారు.

కంటోన్మెంట్‌లో మహిళా కాంగ్రెస్ బలోపేతమే ధ్యేయం

● భవానీ సుందర్ రాజన్



సికింద్రాబాద్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో మహిళా కాంగ్రెస్ బలోపేతమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నట్టు కంటోన్మెంట్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు భవానీ సుందర్ రాజన్ తెలిపారు. పార్టీ పెద్దల ఆదేశాల మేరకు సభ్యత్వ నమోదు, పార్టీ కార్యక్రమాల నిర్వహణలో చురుగ్గా పని చేశారు. దాంతో పార్టీ పెద్దల దృష్టిలోకి రావడంతో కంటోన్మెంట్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఇటీవలే నియమితులయ్యారు. తనపై విశ్వాసంతో నియోజకవర్గ మహిళా కాంగ్రెస్ బాధ్యతలు అప్పగించిన మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు, సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షురాలు పుస్తకాల కవితలకు ఆమె సోమవారం మీడియా సమక్షంలో కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ పెద్దల ఆశీస్సులు, కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ మార్గదర్శకం మేరకు కంటోన్మెంట్ నియోజకవర్గంలో హస్తం పార్టీ పటిష్టతకు, ముఖ్యంగా మహిళా కాంగ్రెస్ విభాగాన్ని బలోపేతం చేసేందుకు ప్రణాళికబద్ధంగా ముందుకు సాగుతున్నట్టు ఆమె వెల్లడించారు. సభ్యత్వ నమోదుతోపాటు పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే మహిళలకు పెద్ద పీట వేస్తామని ఆమె స్పష్టం చేశారు.



గాయత్రీదేవి దంపతులను సత్కరిస్తున్న రుషిపీఠం ప్రతినిధులు

గాయత్రీదేవికి రుషిపీఠం పురస్కారం

చిలకలగూడ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఆయుర్వేద వైద్యంలో విశేష కృషి చేసిన డాక్టర్. అల్లం రాజు గాయత్రీదేవికి రుషిపీఠం పురస్కారం అందజేశారు. పద్మారావునగర్, కౌతా కల్యాణ ముండపంలో ఆదివారం రాత్రి నిర్వహించిన పురస్కార ప్రదానోత్సవానికి ముఖ్య అతిథిగా జస్టిస్ కె.లక్ష్మణ్ విచ్చేసి ప్రసంగిస్తు ఉమ్మడి కుటుంబ వ్యవస్థ అంతరించి పోతున్నదని, పబ్‌లు, క్లబ్‌ల కల్చర్ పెరిగి పోతున్నదని ఆవేదన వ్యక్తం చేసారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణ అవసరమని సూచించారు. ఆయుర్వే వైద్యం నాటు వైద్యమని అపవాదు వుండేదని కాని అది నేటికి ఆరోగ్యంగా వుండటానికి దోహదం చేస్తుందని తెలిపారు. ప్రత్యేక అతిథిగా విచ్చేసిన డాక్టర్.వి.వి.యస్. రామశాస్త్రి మాట్లాడుతూ ఆయుర్వేదం పురాతన వైద్యమని చరకసంహితలోని విశేషాలు ప్రాశస్త్యం వివరించారు. ఋషిపీఠం అధ్యక్షుడు సామవేదం షణ్ముఖశర్మ సభాధ్యక్షత వహించి మాట్లాడుతు ప్రాచీన భారతీయ విద్యలను ప్రోత్సహించటానికి తగు చర్యలు చేపడుతన్నట్లు అందులో భాగంగా వివిధ రంగాలలో ఉత్తమ ప్రతిభ కనబరచిన వారిని పీఠం తరఫున ప్రతి సంవత్సరం ఒకరిని ఎంపిక చేసి పురస్కార ప్రదానం చేస్తున్నట్లు ఇప్పటి వరకు 9 మందికి పురస్కారం అందజేసినట్లు, సనాతన ధర్మ పరిరక్షణ కోసం చేపట్టిన చర్యలు వివరించారు. అనంతరం ప్రముఖ ఆయుర్వేద డాక్టర్ గాయత్రీదేవికి రుషిపీఠం పురస్కారం అందజేసి దంపతులను ఘనంగా సత్కరించారు. డా.గాయత్రీ దేవి స్పందన తెలియజేస్తు ఆయుర్వేదం పురాతన భరతీయ వైద్యమని ఆదరణ తగ్గలేదని, ప్రాచీన భారతీయ వైద్య గ్రంథాలు చరకసంహిత, శుశ్రుత సంహితలను అనువాదం జేశానని ఆయుర్వేద వైద్య విద్యార్థులకి ఎంతో ఉపయుక్తంగా వుంటాయని వివరించారు. కార్యక్రమంలో డాక్టర్లు, ఆర్. విద్యానాథ్, పద్మనాభ రెడి, కార్యవర్గ సభ్యులు మారేపల్లి సూర్యనారాయణ, కె. భాస్కర రమణ మూర్తి, బులుసు హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

యువతి ఆత్మహత్య

బౌద్ధనగర్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఓ యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటన వారాసిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై మల్లికార్జున్ తెలిపిన వివరాల ప్రకారం... జనగాం జిల్లా పాలకుర్తి మండలం అయ్యగారిపల్లికి చెందిన ఎన్. సంధ్యా(22) నర్సింగ్ పూర్తి చేసింది. అమీర్‌పేట్‌లో హాస్టల్లో ఉంటున్న సంధ్యా నాలుగు నెలల క్రితం హాస్టల్ ఖాళీ చేసి పార్సీగుట్ట న్యూఅశోక్‌నగర్‌లో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని ఉంటుంది. గాంధీనగర్‌లో ఓహోమ్‌కేర్‌లో పనిచేస్తుంది. ప్రతిరోజు తండ్రి సునావత్ చలపతితో పాటు కుటుంబ సభ్యులు కుమార్తె సంధ్యకు ఫోన్ చేసి క్షేమసమాచారాలు తెలుసుకునేవారు. ఆదివారం ఉదయం పది గంటలకు తండ్రి చలపతి సంధ్యకు ఫోన్ చేశాడు. లిఫ్ట్ చేయకపోవటంతో బీజీగా ఉందనుకుని సాయంత్రం ఫోన్ చేశాడు. ఫోన్ ఎంతకీ తీయకపోవటంతో సోమవారం ఉదయం తల్లితండ్రులు గ్రామం నుంచి బయలుదేరి ఉదయం ఏడు గంటలకు కుమార్తె ఇంటికి వచ్చారు. ఎంతకీ తలుపులు తీయకపోవటంతో స్థానికులు సహాయంతో తలుపులు పగులగొట్టి లోపలకి వెళ్లి చూడగా సంధ్య సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని కనిపించింది. వెంటనే వారాసిగూడ పోలీసులకు సమాచారమందించారు. సంధ్య మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తంగా గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. తండ్రి చలపతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసును నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. సంధ్య ఆత్మహత్య గల కారణాలు తెలియలేదు.

పేకాట ఆడుతున్న ఏడుగురి అరెస్ట్

బౌద్ధనగర్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేసి చిలకలగూడ పోలీసులకు అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సీతాఫల్‌మండి డివిజన్ శ్రీనివాస్‌నగర్‌లో ప్రతిరోజు ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నారని ఈస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారమందింది. టాస్క్‌ఫోర్స్ ఎస్సై కరుణాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి పేకాట ఆడుతున్న ఇంటిపై దాడి చేసి ఏడుగురిని పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.7,350 నగదు స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పేదలకు వరం కల్యాణలక్ష్మి, షాదీముబారక్

● ఎమ్మెల్యే పద్మారావుగౌడ్



కార్పొరేటర్లతో కలిసి లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

బౌద్ధనగర్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): పేదలకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకం వరంగా నిలుస్తోందని సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుగౌడ్ అన్నారు. సోమవారం బౌద్ధనగర్ జీహెచ్‌ఎంసీ కమ్యూనిటీ హాల్‌లో 1.79 కోట్ల విలువచేసే కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ముషీరాబాద్ మండల తహసీల్దార్ కొర్ర రాణాప్రతాప్‌సింగ్, కార్పొరేటర్లు కంది‌శైలజ, సామల హేమ, సునీత, ప్రసన్నలక్ష్మీలతో కలిసి ఆయన 179 మంది లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా పద్మారావుగౌడ్ మాట్లాడుతూ పేద ప్రజల పిల్లల పెళ్లిళ్ల ఖర్చు, ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని గత కేసీఆర్ ప్రభుత్వం అద్భుతమైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కందినారాయణ, నాయకులు కరాటేరాజు, సుంకు రామచందర్, బెజ్జంకి రాజేష్, గంగాపురం ఆంజనేయులుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

● చెక్కులు పంపిణీ విషయంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీ నాయకుల మధ్య గొడవ జరుగుతుందని అందరూ అనుకున్నారు. ముందుస్తూ జాగ్రత్తగా చిలకలగూడ డివిజన్ ఏసీపీ జైపాల్‌రెడ్డి, వారాసిగూడ ఇన్‌స్పెక్టర్ సైదులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ తెలివిగా ప్రొటోకాల్ ప్రకారం కార్పొరేటర్లు, అధికారులు, సీఐ, ఎస్సైలు, కానిస్టేబుళ్లతో లబ్ధిదారులకు చెక్కులను ఇప్పించారు. దీంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

‘గాంధీ’లో చిన్నారులకు వినికిడి యంత్రాల పంపిణీ



గాంధీ ఆస్పత్రిలో జరిగిన కార్యక్రమానికి హాజరైన ఐఏఎస్ అధికారి కర్ణన్

అడ్డగుట్ట, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక దశలో గుర్తిస్తే వినికిడి సమస్యలకు చికిత్స అందించవచ్చని రాష్ట్ర వైద్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్.వి కర్ణన్ సూచించారు. సోమవారం గాంధీ ఆస్పత్రిలో ఆవరణలో అలూమ్ని భవనంలో నిర్వహించిన ఈఎన్‌టీ చిన్నపిల్లల వార్డులో చికిత్స పొందుతున్న వారికి మీనాక్షి వెంకట్ రామన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 40 మంది చిన్నారులకు చెవి వినికిడి యంత్రాల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు మానవ శరీరంలో ఏదైన అవయవం పనిచేస్నుడే దాని విలువ తెలుస్తుందన్నారు. పుట్టిన చిన్నారి శబ్దం విని దానిని గ్రహించకపోతే మాటలు కూడా రావాని అందుకే శిశువుగా ఉన్నప్పుడే పిల్లలకు వైద్యుల సలహాలు తీసుకోవాలని సూచించారు. ఆరోగ్యశ్రీ పథకంలో మూడేళ్లలోపు చిన్నారులకు మాత్రమే కాక్లీయర్ ఇంప్లాంట్ సర్జరీ చేస్తున్నారన్నారు. త్వరలో ఐదేళ్ల వయస్సు పొడగిస్తామని ఆయన హామీ ఇచ్చారు. మీనాక్షి ఫౌండేషన్ ట్రస్టీ సేతురామన్ మాట్లాడుతూ 2013లో గాంధీలో సేవలు ప్రారంభించామని తమ సంస్థ ద్వారా ఇప్పటికి రెండు లక్షల మంది చిన్నారులకు వినికిడి యంత్రాలు పంపిణీ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజకుమారి, ఈఎన్‌టీ విభాగాధిపతి భూపేందర్ సింగ్ రాథోడ్, దాత ఆదినారాయణ, డాక్టర్ రంగనాథ్; మురళి నటరాజన్, ప్రసాదరావులు పాల్గొన్నారు.

వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలి

● బోయ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు గోపి



సమావేశంలో మాట్లాడుతున్న మీనగ గోపి

పంజాగుట్ట, మార్చి 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని, ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చాలని బోయ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు మీనగ గోపి బోయ డిమాండ్ చేశారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని గత 30 సంవత్సరాలుగా తాము పోరాడుతున్నామని, పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో తమను ఎస్టీల్లో చేరుస్తామని రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఇచ్చిన మాటను సీఎం నిలబెట్టుకోవాలని, రూట్ మ్యాప్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఈసారి ఎన్నికల్లో తమ తడాఖా చూపిస్తామని హెచ్చరించారు. వాల్మీకి బోయలకు చట్టసభల్లో సముచిత స్థానం కల్పించాలని, తమ సామాజిక వర్గానికి ఎమ్మెల్సీ పదవి కేటాయించాలని సీఎం రేవంత్ రెడ్డిని ఆయన కోరారు. ఈ సమావేశంలో సమితి ఉపాధ్యక్షుడు పుట్ట అంజయ్య, న్యూ ఇండియా పార్టీ ఉపాధ్యక్షుడు మాదర బోయిన నర్సయ్య, గగనం వెంకటస్వామి, అలివేలు, సి.పరమేశ్వరి, గుజ్జుల యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

● మన ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు చొప్పరి శంకర్



అభివాదం చేస్తున్న ముదిరాజ్ సంఘాల నాయకులు

పంజాగుట్ట, మార్చి 3(ఆంధ్రజ్యోతి): ముదిరాజ్ సామాజిక వర్గాన్ని విస్మరిస్తే బీఆర్‌ఎస్‌కు పట్టిన గత్యే కాంగ్రెస్ ప్రభుత్వానికి పడుతుందని మన ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు చొప్పరి శంకర్ ముదిరాజ్ హెచ్చరించారు. జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ముదిరాజ్ సంఘాల నాయకులతో కలిసి ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలన్నారు. కేసీఆర్ హయాంలోని సమగ్ర కుటుంబ సర్వే లెక్కలకు, ప్రస్తుత ప్రభుత్వం చేపట్టిన కుల సర్వే లెక్కలకు చాలా తేడా ఉందని, తమ జనాభాను తక్కువగా చూపించారని ఆరోపించారు. రేవంత్ రెడ్డి ప్రతి బహిరంగ సభలో ముదిరాజ్‌లను బీసీ-డి గ్రూపు నుంచి బీసీ-ఏ జాబితాలో చేరుస్తామని చెప్పారని, అయితే ఎన్నికల తర్వాత సీఎం నోటి వెంట ముదిరాజ్‌ల మాటే రావడం లేదని విమర్శించారు. తమ సామాజిక వర్గానికి ఉన్న ఒక్క ఎమ్మెల్యేతో పాటు మరొకరికి మంత్రివర్గంలో స్థానం కల్పించాలని, నాలుగు ఎమ్మెల్సీలు,పది కార్పొరేషన్ ఛైర్మన్ పదవులు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ముదిరాజ్ మత్స్యకారులపై దాడులు జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. సమావేశంలో ముదిరాజ్ సంఘాల నాయకులు అశ్విని ముదిరాజ్, సాయికిరణ్, సంతోష్ పాల్గొన్నారు.

సమస్యలపై సీపీఎం నాయకుల ఇంటింటి సర్వే

బోరబండ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): బోరబండ డివిజన్ పరిధిలోని సంతోష్ నగర్‌లో సీపీఎం జూబ్లీహిల్స్ జోన్ కమిటీ ఆధ్వర్యంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సోమవారం ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సమస్యలను స్థానికులు వారికి వివరించారు. ప్రధానంగా సంతోష్ నగర్ చెన్నకేశవస్వామి ఆలయం పరిసర ప్రాంతాల్లో రాత్రి సమయంలో మందుబాబుల ఆగడాలు ఎక్కువయ్యాయని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని బస్తీ అధ్యక్షుడు శ్రీనివాస్ కోరారు. తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతోందని, కొన్ని ప్రాంతాల్లో షార్ట్ సర్క్యూట్‌తో ఇబ్బందికరంగా ఉంటుందని ఫిర్యాదు చేశారు.

కొత్తగా అమలుచేస్తున్న పథకాలకు దరఖాస్తు చేసుకున్న చాలామందికి కరెంటు బిల్లులు, గ్యాస్ బిల్లులు మాఫీ కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఎం జూబ్లీహిల్స్ జోన్ నాయకులు టి.సాయి శేషగిరిరావు, జె.స్వామి, మద్దిలేటి, ఏఆర్ నరసింహ, బాలయ్య, జ్యోతి, సత్యనారాయణ, శేషు, భవాని, మల్లీశ్వరి, షేక్ బాబు తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్న రెసోర్స్ పర్సన్స్

నూతన ఉపాధ్యాయులకు శిక్షణ

రాంగోపాల్‌పేట్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో నియమించబడిన నూతన ఉపాధ్యాయులకు బన్సీలాల్‌పేట్‌లోని గుండా ఈశ్వరయ్య స్మారక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మూడురోజుల పాటు సాగిన ఇండక్షన్ శిక్షణ కార్యక్రమం సోమవారం ముగిసింది. మొదటి రోజు సికింద్రాబాద్ జోన్ డిప్యూటీ ఈఓ శ్రీధర్ శిక్షణను ప్రారంభించగా చివరి రోజు జిల్లా క్వాలిటీ కో ఆర్డినేటర్ ఉమాదేవితో కలిసి కోర్స్ డైరెక్టర్ కస్తూరీ పాల్గొని నూతన ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ వృత్తిలో ఆదర్శవంతంగా ఎలా ఉండాలో, నిబద్ధతతో ఎలా పని చేయాలో, విద్యార్థులకు విద్యాబోధనలోని మెళకువళను వంటి పలు అంశాలలో అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలలో అమలు చేస్తున్న ఎఫ్‌ఎల్‌ఎన్ (ఫండమెంటల్ లిటరసీ అండ్ న్యూమరసీ) బోధనా పద్ధతులు, సృజనాత్మకంగా గుణాత్మకంగా విద్యను అందించాలనే విషయాలను విద్యార్థుల మెదళ్లలో నాటుకుపోయేలా బోధనను అందించే మెళకువలను వారికి అందించారు. శిక్షణ కార్యక్రమంలో సికింద్రాబాద్, ముషీరాబాద్, నాంపల్లి, సైదాబాద్, బండ్లగూడ, మారేడుపల్లి, బహదూర్‌పురా, తిరుమలగిరి మండలాలకు చెందిన దాదాపు 150 మంది ఎస్‌జీటీలు పాల్గొనగా రెసోర్స్ పర్సన్స్‌గా వినోద్ కుమార్, అనిత, అనుపమ, శశిరేఖ, మేరి సరళ, రాజ్యలక్ష్మీ, సంతోష్ కుమారి, నీరజ వ్యవహరించారు.



మహ్మద్‌గూడ సమీ మసీదు ఎదుట మురికినీరు పారుతున్న దృశ్యం

మసీదుల వద్ద సదుపాయాలు కల్పించాలి

బౌద్ధనగర్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): రంజాన్ ఉపవాస దీక్షలు జరిగే సమయంలో మసీదుల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించాలని పలువురు ముస్లింలు అధికారులు, ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తి చేస్తున్నారు. సీతాఫల్‌మండి డివిజన్ మహ్మద్‌గూడ సమీ మసీదు వద్ద నిత్యం మురికినీరు పారుతుందని, సీవరేజీ పైపులైన్‌ల మరమ్మతుల పేరుతో రోడ్లను తవ్వి నిర్లక్ష్యంగా వదిలి వేశారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం, సాయంత్రం ఈ ప్రాంతంలో ఉన్న రెండు మసీదులకు ప్రార్థనలకు వెళ్లే సమయంలో ఇబ్బందులు పడుతున్నామని వారు తెలిపారు. ఇప్పటికైన ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి మహ్మద్‌గూడ ప్రాంతంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, తవ్విన రోడ్లుకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



ఉచిత వైద్య శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

అడ్డగుట్టలో ఉచిత వైద్య శిబిరం

అడ్డగుట్ట, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం అడ్డగుట్టలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించామని సంస్థ ప్రోగ్రాం మేనేజర్ బాలశ్రీ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ సాక్సా ఆధ్వర్యంలో ప్రతి రోజు ఒక్కొక్క డివిజన్‌లో రక్త పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి రోజు వందకు పైగా పరీక్షలు నిర్వహించి అప్పటికప్పుడు రిపోర్టులు ఇస్తున్నామన్నారు. ప్రజల వదకు వచ్చే ఈ రక్త పరీక్షల ఉచిత వైద్య శిబిరాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సుగుణ, భాగ్య, శైలజ, కౌన్సిలర్ రమేష్, సీహెచ్‌ఏసీ ఆస్పత్రి ప్రతినిధి రంజిత్, ఎయిడ్స్ అవగాహన కో-ఆర్డినేటర్లు ఎన్‌జీఓ ప్రతినిధులు శ్రీసాయి, మల్కాజిగిరి మహిళా సంఘం సంఘ సేవకురాలు అచ్యూతతదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు

బంజారాహిల్స్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ తిరుమల తిరుపతి దేవస్థానంలో వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు కనులపండువగా జరుగుతున్నాయి. సోమవారం ఉదయం స్వామివారికి ప్రత్యేక సుప్రభాత సేవ నిర్వహించారు. అనంతరం హనుమంత వాహనంపై స్వామివారిని ఊరేగించారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

బర్కత్‌పుర, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. కాచిగూడ రైల్వే పీఎస్ హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణచారి తెలిపిన వివరాల ప్రకారం.. కాచిగూడ రైల్వేస్టేషన్ సమీపంలో సోమవారం 50 ఏళ్ల వయసు గల గుర్తుతెలియని వ్యకి పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలతో ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.